క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు 8 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓ, హెచ్‌ఎం

నగరి : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలలో నగరి మండలం నుంచి 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో నెత్తంకండ్రిక ఎంపీపీ స్కూల్‌కు చెందిన జనని, కేవీపీఆర్‌పేట ఎంపీపీ స్కూల్ విద్యార్థి సతీష్ కుమార్, పుదుపేట ఉన్నత పాఠశాలకు చెందిన కావ్య, కీర్తన, ఐశ్వర్య, చింతలపట్టెడ ఉన్నత పాఠశాలకు చెందిన సతీష్, తమిళ్‌సెల్వి, సత్రవాడ ఉన్నత పాఠశాలకు చెందిన కావ్య ఉన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో ఎంఈఓ శ్రీదేవి అభినందించారు. వారికి ప్రశంసాపత్రంతో పాటు పుస్తకాలను బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేలు చొప్పున నాలుగేళ్లకు స్కాలర్‌షిప్ లభిస్తుందన్నారు. విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన గైడ్ టీచర్లను అభినందించారు. హెచ్‌ఎంలు ప్రసన్నకుమారి, నాధముని, కుప్పరాజు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాల వేలం



వాహనాలను వేలం వేస్తున్న ఎక్సైజ్ అధికారులు

నగరి : వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పలు వాహనాలను సోమవారం వేలం వేశారు. చిత్తూరు, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆయేషాబేగం ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. 18 ద్విచక్ర వాహనాలను వేలానికి ఉంచగా 16 వాహనాలను వేలంలో దక్కించుకున్నారు. ఈ వాహనాల వేలంతో జీఎస్టీతో కలిపి రూ.1,72,630 వసూలైనట్లు, నగరి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీస్ స్టేషన్ సీఐ వర్ధనాదేవి తెలిపారు. ఈ వేలంలో ఎస్‌ఐ భానుప్రకాష్, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అరుణగిరిపై ప్రత్యేక పూజలు



భక్తులకు ప్రసాదాలు అందజేస్తున్న అర్చకుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం కొండమల్లీశునికి పాలాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మహిళా అభివృద్ధే ప్రభుత్వ ఆశయం

- ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే
- మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం
- మీ అందరి ఆశీర్వాదాలు జగనన్నపై ఉండాలి
- మంత్రి రోజా



నిండ్రలో మహిళా సంఘాల సభ్యులకు చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

నిండ్ర: మహిళలు ఆర్థిక సుస్థిరత సాధించడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖామంత్రి రోజా అన్నారు. నిండ్ర మండల కేంద్రంలో సోమవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో మహిళల కోసం ఇన్ని సంక్షేమ పథకాలు ఏ ముఖ్యమంత్రి అమలు చేయలేదని, కానీ జగనన్న చేసి చూపించారని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడం గర్వంగా ఉందన్నారు. వైఎస్సార్ ఆసరా కింద మూడవ విడతలో 739 సంఘాలకు రూ.5.52 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాన్ని చంద్రబాబు అప్పుల్లో పెట్టారని, జగనన్న ఎన్ని కష్టాలు వచ్చినా తన పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తున్నారని ఆమె అన్నారు. మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవడానికి అక్కచెల్లెమ్మ ఆదరణ, దీవెనలు అందించాలని మంత్రి కోరారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చివరలో మహిళా సంఘాల సభ్యులకు చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా డీఆర్‌డీఏ పీడీ తులసి, మండల కన్వీనర్ వేణురాజు, ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జయశ్రీ, ఎంపీడీఓ వేణు, తహసీల్దార్ నాగరాజు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, కోఆప్షన్ సభ్యులు అనిల్, ఆర్‌బీకే చైర్మన్ వీరయ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి మేరీ, ఎంపీటీసీ విజేష్, మంజుల, ఏపీఎం చంద్రకళ, సర్పంచ్‌లు వసంతమ్మ, గౌరి, మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ వెంకటేష్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..



నిండ్ర: సబ్సిడీ ట్రాక్టర్లను పంపిణీ చేస్తున్న మంత్రి

నిండ్ర మండలంలో సోమవారం రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు సబ్సిడీపై మంజూరైన వ్యవసాయ యంత్ర పరికరాలను మంత్రి రోజా పంపిణీ చేశారు. అగరం, కర్వరవేడు గ్రామాలకు చెందిన రైతులకు రెండు ట్రాక్టర్లు, పరికరాలు, వేరుశనగ నూర్పిడి యంత్రాన్ని మంత్రి రోజా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులను అన్నివిధాలా ఆదుకునే ప్రభుత్వం మనదే అన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే చైర్మన్ వీరయ్యనాయుడు, ఏఓ మురళీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ పనుల పూర్తిపై సమీక్ష



గృహనిర్మాణ పనులు, తాగునీటి సమస్యలపై మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం : మండలంలోని జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలను త్వరగానే పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలంలోని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న లేఅవుట్లలో గృహనిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేయాలన్నారు. జగనన్న లేఅవుట్‌లలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, సీసీ రోడ్లు వంటి మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ అభివృద్ధికి కృషి చేస్తాం



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు బాలాజీ

కార్వేటినగరం: మండలకేంద్రంలోని సామాజిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధికి కృషి చేస్తామని అభివృద్ధి కమిటీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. సోమవారం సామాజిక ఆరోగ్యకేంద్రం(సీహెచ్‌సీ)లో ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సౌకర్యాలు అందించడానికి 50 పడకల ఆస్పత్రిని మంజూరు చేశారని గుర్తు చేశారు. ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. అలాగే వైద్యులు 24 గంటలు రోగులకు అందుబాటులో ఉంటూ నిర్లక్ష్యం వహించకుండా వైద్యసేవలు అందిస్తూ ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే వైద్య సేవల కొరకు అత్యవసరంగా కావల్సిన మల్టీచానల్ మానిటర్లు, బ్లడ్ ఫ్రెజర్ ఆపరేటర్లు, ఇతర పరికరాలు కావాలని హెచ్‌డీఎస్‌ను కోరగా అభివృద్ధి కమిటీ అందుకు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్, ఆస్పత్రుల అభివృద్ధి సొసైటీ కన్వీనర్ డాక్టర్ భాగ్యలక్ష్మి, సొసైటీ సభ్యులు ఎంపీడీఓ మోహన్‌మురళి, డాక్టర్ మురళి, ధనంజయవర్మ, అలాగే ఫార్మసిస్టు వరలక్ష్మి, స్టాఫ్ నర్స్ సౌభాగ్య, పలువురు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి కృష్ణజింక



గ్రామస్తులు బంధించిన కృష్ణజింక

కార్వేటినగరం: వేసవి తాకిడికి అడవుల్లో నీరు లేక దాహం తీర్చుకోవడానికి వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయి. తాజాగా సోమవారం ఓ కృష్ణజింక మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న బీసీ కాలనీలోకి వచ్చిన సంఘటన చోటు చేసుకుంది. అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ కథనం మేరకు వివరాలిలా.. అటవీ ప్రాంతం నుంచి తాగునీటి కోసం గ్రామానికి వచ్చిన కృష్ణజింకను వీధి కుక్కలు తరమడంతో జింక ఓ ఇంటి ఆవరణలోకి వెళ్లింది. దీంతో ఆ ఇంటి కుటుంబ సభ్యులు చూసి పంచాయతీ ఈఓ పీఎస్ మణికి సమాచారం అందించారు. స్పందించిన ఆయన అక్కడికి చేరుకుని తమకు తక్షణమే సమాచారం అందించారని ఎఫ్ఆర్ఓ తెలిపారు. జింకను కుప్పాని గుంట అటవీ ప్రాంతంలో వదిలి పెట్టినట్లు చెప్పారు.

ప్లాస్టిక్ నివారణపై అవగాహన



ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కార్వేటినగరం: ప్లాస్టిక్ వస్తువులు వాడి ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని ఈఓపీఆర్డీ లక్ష్మీపతి అన్నారు. సుద్దగుంట గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను వాడి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. అదే విధంగా గ్రామాల్లో, పట్టణాల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు వాడుతున్నట్లు తెలిసిన వెంటనే పంచాయతీ ఈఓకు సమాచారం అందించాలన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి విద్యార్థులు సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగంగా ప్లాస్టిక్ నిషేధిత కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో 100 కేజీల ప్లాస్టిక్ బాటిళ్లను సేకరించి పంచాయతీకి అప్పగించారు. అలాగే ప్లాస్టిక్ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ధనంజయరెడ్డి, పీడీ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

హైస్కూల్ గేటు చోరీపై ఫిర్యాదు

వెదురుకుప్పం: మండలంలోని దేవళంపేట జెడ్పీ హైస్కూల్‌కు అమర్చిన ప్రధాన గేటును గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం సుందరేశం సోమవారం వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రధాన ద్వారం వద్ద ఒక పక్క గేటును పగులగొట్టి అపహరించినట్లు చెప్పారు. గేటు విలువ రూ.20 వేలు ఉంటుందన్నారు. అయితే ఇప్పుడు గేటు లేకపోవడంతో పాఠశాలకు రక్షణ కొరవడిందన్నారు. ఈ కారణంగా రాత్రి పూట స్కూల్‌లోకి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి విలువైన సామగ్రిని అపహరించే ఆస్కారం ఉందని, తక్షణం దొంగలను పట్టుకుని వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

పదో తరగతి విద్యార్థులకు ఘన వీడ్కోలు

నగరి : స్థానిక జిల్లాపరిషత్ తడుకుపేట ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు విద్యాసంవత్సరం పూర్తయి పరీక్షలకు హాజరు కావడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో వారికి వీడ్కోలు పలుకుతూ సరస్వతి పూజ నిర్వహించారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాయాలని ప్రార్థించారు. అనంతరం పరీక్షలు రాసే విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, విద్యను బోధించిన గురువులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్పంచ్ కౌసల్య పెన్నులు, ప్యాడ్లు, స్కేళ్లు అందించారు. ఉత్తమ విద్యార్థి కావ్యకు బయాలజీ ఉపాధ్యాయులు మిక్సీని బహుమతిగా అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కన్నియప్ప, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సింధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కూల్ రికార్డుల తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీదేవి

నగరి : మండలంలోని బుగ్గ అగ్రహారం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో రికార్డులను ఎంఈఓ శ్రీదేవి తనిఖీ చేశారు. సోమవారం పాఠశాలకు వెళ్లిన ఆమె మోడల్ రికార్డులను పరిశీలించారు. అకడమిక్ అంశాలు, టీచర్స్ డైరీ, లెసన్ ప్లాన్లు, విద్యార్థుల వర్క్‌బుక్స్ పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. పరిశీలనలో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉందని, ఇలాగే కొనసాగించాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీల రక్షణకే మానిటరింగ్ కమిటీ



మాట్లాడుతున్న జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు

నగరి : ఎస్సీ, ఎస్టీల రక్షణకే విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఉందని జిల్లాస్థాయి కమిటీ సభ్యులు పి.బాబు అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సుజన అధ్యక్షతన నిర్వహించిన డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఇతర సమస్యల గురించి చర్చించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉన్న చట్టాల గురించి వివరించారు. మానిటరింగ్ కమిటీ ఎప్పుడూ వారికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎ.దేవరాజులు, వి.రాజ్‌కుమార్, ఎం.డేవిడ్, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, హాస్టల్ వార్డన్లు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో గైనకాలజిస్టు వైద్యసేవలు

పుత్తూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గైనకాలజిస్టుగా డాక్టర్ ప్రశాంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ శంకర్ నరేన్ మీడియాతో మాట్లాడుతూ ఆస్పత్రిలో ముగ్గురు డాక్టర్ల కొరత ఉందని ఇటీవలే స్థానిక మంత్రి ఆర్కే రోజా దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి ఆదేశాల మేరకు నగరిలో ఎక్కువగా ఉన్న గైనకాలజిస్టు డాక్టర్‌ను ఇక్కడికి బదిలీ చేస్తూ చిత్తూరు డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్ ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. దీంతో ఆస్పత్రిలో వైద్యుల సంఖ్య 6కు పెరిగిందన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాల వితరణ



కళ్ల అద్దాలతో విద్యార్థులు

పుత్తూరు రూరల్: ప్రతిఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని రాచపాళెం గ్రామానికి చెందిన స్వయంకృషి జనహిత స్వచ్ఛంద సేవాసంస్థ, తిరుపతికి చెందిన అరవింద్ కంటి ఆస్పత్రి వారు సంయుక్తంగా 30 మంది విద్యార్థులకు కంటి అద్దాలను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కమిషనర్ మాట్లాడుతూ రాచపాళెం గ్రామంలో తరచూ సేవా కార్యక్రమాలు జరుగుతుండడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. పేద విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా కళ్ల అద్దాలు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి, డైట్ వైస్ ప్రిన్సిపల్ చెంగల్రాజు, పుత్తూరు పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు భాస్కర్‌రాజు, విజయ్‌కుమార్, చిరంజీవులు, మోహన్‌రాజు, సుధాకర్‌రాజు, హెచ్‌ఎం కుమారవేలు, పాఠశాల కమిటీ చైర్మన్ సుభాషిణి పాల్గొన్నారు.

కళాకారులకు విశిష్ట సేవా పురస్కారాలు



విశిష్ట సేవా పురస్కారాలు అందుకున్న కళాకారులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ప్రపంచ రంగస్థలి దినోత్సవాన్ని పురస్కరించుకుని సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో కళారంగంలో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ కళామతల్లికి సేవలందిస్తున్న కళాకారులకు విశిష్ట సేవా పురస్కారాలతో సత్కరించారు. ప్రకాశం రోడ్డులోని ఎస్వీ నాట్య కళాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బ్లిస్ హోటల్ అధినేత, కళాపోషకుడు మబ్బు సూర్యనారాయణరెడ్డి, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఉత్తమ నటులుగా ఆమూరి సుబ్రమణ్యం, బొంద రామచంద్రారెడ్డి, జీఎస్.కోటేశ్వరరావు, కె.సిద్ధేశ్వర శర్మ, గంగయ్య, గోపాల్‌రావు, నాథమునిరెడ్డి, కె.చంద్రబాబు నాయుడు, డి.గోపాల్‌ను విశిష్ట సేవా పురస్కారాలతో సత్కరించారు. అలాగే ఉత్తమ నటీమణులుగా పి.యశోద, శోభశ్రీ, డి.హసీనా, కె.సాయి నవీనలను, ఉత్తమ హాస్యనటుడిగా శాంబోలు హరినాథ్, ఉత్తమ హాస్యనటిగా సుభద్రలను విశిష్ట సేవా పురస్కారాలతో సత్కరించారు. కళాపరిషత్ అధ్యక్షుడు కోనేటి సుబ్బరాజు పాల్గొన్నారు.

మహిళా ఆర్థిక సాధికారతే లక్ష్యం



పాలసముద్రం: లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి



వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి వచ్చిన మహిళలు

- ఆర్థిక పొదుపులో మహిళలదే కీలకపాత్ర
- ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన ప్రభుత్వం మాదే
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : మహిళలు ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తే ఆ కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ సీఎం, ఎక్సైజ్‌శాఖ మంత్రి నారాయణస్వామి తెలిపారు. సోమవారం బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీపీ శ్యామల, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ సమక్షంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 5,323 స్వయం సహాయక పొదుపు సంఘాలు ఉండగా, అందులో 49,720 మంది మహిళలకు రూ.53.37 కోట్లను ముఖ్యమంత్రి బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమచేశారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు సకాలంలో అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదే అన్నారు. ముఖ్యంగా మహిళల్లో ఉండే ఆర్థిక క్రమశిక్షణ వారి కుటుంబాలకు శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. అనంతరం ఆయన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తులసీయాదవ్, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర కమిటీ చైర్మన్ శివప్రకాష్ రాజు, వైస్ ఎంపీపీలు శేఖర్ యాదవ్, పుష్ప, సర్పంచులు భాస్కర్ రెడ్డి, గాలి మహేష్ బాబు, తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ శ్రీనివాసన్, రైతు భరోసా చైర్మన్ పోలయ్య, ట్రాన్స్‌కో ఏడీ జ్ఞానేశ్వర్, ఏఈ వరదరాజులు, డ్వాక్రా సంఘ సభ్యులు, సుబ్రమణ్యరెడ్డి, ఇందిరమ్మ, త్యాగరాజు, కేశవరెడ్డి, అరుల్, రవిరెడ్డి షణ్ముగరెడ్డి, మండల పరిధిలోని తదితర నాయకలు పాల్గొన్నారు.

జీవితం సంతోషంగా ఉంది..



నేను, నా భర్త గతంలో కూలీ పనులకు వెళ్లే వాళ్లం. ఆ పని చేయలేక ఇబ్బంది పడుతున్న మాకు వైఎస్సార్ రెండవ విడతలో రూ.20 వేలు వచ్చింది. దాంతో స్త్రీనిధి కింద రూ.30 వేలు రుణం తీసుకుని పాడిపశువు పట్టుకున్నా. నెలకు రూ.8 నుంచి రూ.10 వేలు ఆదాయం వస్తోంది. పిల్లలకు అమ్మఒడి వస్తుంది. ఒక్క మాటల్లో చెప్పాలంటే జగనన్న మా జీవితాలను మార్చేశారు. ఆయనకు మా కుటుంబం రుణపడి ఉంటుంది. – షకీనా, మహదేవపురం, పాలసముద్రం

ప్రభుత్వాన్ని కాపాడుకుంటాం..



పేదల కోసం తపించే ఇంటువంటి ప్రభుత్వమే మాకు కావాలి. చెప్పిన ప్రకారం అన్నీ ఇస్తున్నారు. ముఖ్యంగా స్వయం సహాయక బృందాలు తీసుకున్న రుణాలు కూడా జగనన్న కడుతున్నాడు. 2017లో డ్వాక్రాలో చేరాను. తీసుకున్న మొత్తాన్ని కూడా దశలవారీగా ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ మరువను.

– భార్గవి, బాలకృష్ణాపురం

నా భర్తను కాపాడుకున్నా..



నా భర్త అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఆరోగ్యశ్రీ పథకంలో ఆపరేషన్ చేయించి నా భర్తను కాపాడుతున్నారు. అమ్మ ఒడి వస్తోంది. మాలాంటి వారికి ఇలాంటి పథకాలు ఎన్నో అందుతున్నాయి. చాలా గొప్ప విషయం. చిన్న సంతోషాలతో సంబర పడిపోయే మాకు జగనన్న ఇస్తున్న కానుకల గురించి ఎంతచెప్పినా తక్కువే. – పీసీ ప్రియ, ఏటుకూరిపల్లె